క్లుప్తంగా

హరినామ సంకీర్తన మండపాలు ఏర్పాటు చేయాలి

బోట్‌క్లబ్: తిరుమల కొండపై అఖండ హరినామ సంకీర్తన మండపం మాదిరిగా శ్రీవారి అనుబంధ క్షేత్రాల్లో హరినామ సంకీర్తన మండపాలు ఏర్పాటు చేయాలని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. జపాలి తీర్థం, పాప నాశనం, గోవింద రాజులు స్వామి గుడి, తిరుచానూరు పద్మావతి దేవస్థానం, కపిల తీర్థం, అలివేలు మంగమ్మ ఆలయాల వద్ద కూడా హరినామ సంకీర్తన మండపాలు ఏర్పాటు చేయాలన్నారు. తాళ్లపాక అన్నమాచార్య జయంతి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర వస్తువులు అందజేసిన ట్రస్ట్ సభ్యులు

బాలాజీచెరువు: రెడ్‌కాన్వెంట్ స్టూడెంట్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం 15 మంది పేదలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను ట్రస్ట్ కార్యాలయంలో అందజేశారు. పూర్వవిద్యార్థి దొమ్మేటి శివరాం(అమెరికా) సహాయంతో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ 25 వేల విలువైన నిత్యావసర వస్తువులను పేదలకు అందజేశామని, ట్రస్ట్ ద్వారా విద్య, వైద్య తదితర సేవలకు సంబంధించి చేయూత నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు సీమకుర్తి పాపారావు, జగన్నాథం, కళ్యాణి, ప్రసాద్ పాల్గొన్నారు.

రాజా రామ్మోహన్‌రాయ్‌కి ఘన నివాళి



రాజా రామ్మోహన్‌రాయ్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న బోట్‌క్లబ్ వాకర్లు

కాకినాడ రూరల్: సంఘ సంస్కర్త, బ్రహ్మ సమాజ స్థాపకుడు రాజా రామ్మోహన్ రాయ్ జయంతిని పురస్కరించుకుని సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి బుధవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్ మాట్లాడుతూ సాంఘికంగా పలు సంస్కరణలకు రాజా రామ్మోహన్‌రాయ్ ఆద్యుడని, సతీ సహగమనానికి అడ్డుకట్ట వేయడమే కాకుండా వితంతు వివాహాలను ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో డాక్టరు శిరీష, రెడ్నం రాజా, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల వ్యర్థాలు తొలగించరూ



గాంధీనగర్ రైతు బజార్ లోపల ఖాళీస్థలంలో వేసిన కూరగాయల వ్యర్థాలు

బోట్‌క్లబ్: నిత్యం వందలాది మంది వచ్చి కూరగాయలు కొనుగోలు చేసే గాంధీనగర్ రైతు బజార్‌లో కూరగాయల వ్యర్థాలు తొలగించకపోవడంతో ఇటు వినియోగదారులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రైతులు కూరగాయలు వ్యర్థాలు వేసుకొనేందుకు ఇక్కడ డంపర్‌బిన్‌లు ఉండేవి. ప్రస్తుతం డంపర్‌బిన్‌లు లేకపోవడంతో రైతులు వ్యర్థాలను రైతు బజార్‌లోని ఖాళీ ప్రదేశంలో పడవేస్తున్నారు. దీంతో అవి కుళ్లిపోయి దుర్వాసన రావడంతో సమీపంలో ఉండే వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయలు కొనుగోలు చేసుకునేందుకు వచ్చిన వినియోగదారులు సైతం వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసనకు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి ఇక్కడ డంపర్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని వ్యాపారులు కోరుతున్నారు.

పండూరు పీహెచ్‌సీ తనిఖీ



పండూరు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ నరసింహ నాయక్

కాకినాడ రూరల్: మండలంలోని పండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరసింహ నాయక్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో సిబ్బంది విధులకు సంబంధించి రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. వైద్యం కోసం వచ్చే రోగులకు సకాలంలో సేవలు అందించాలని, విధుపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తెలియజేశారు. గైనకాలజిస్ట్ నిరీక్షణ, డీపీఎం డాక్టరు సురేఖ, పీహెచ్‌సీ వైద్యాధికారిణి మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

కొంగోడు తీరేదెలా?

- నీట మునిగిన బల్లకట్టు
- రాకపోకలకు రైతులు, ప్రజల ఇక్కట్లు
- వంతెన నిర్మించాలని విన్నపం



తుల్యభాగ డ్రెయిన్‌ను దాటేందుకు బల్లకట్టుపై ప్రయాణిస్తున్న కొంగోడు గ్రామస్తులు (ఫైల్)



బల్లకట్టుపై ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు (ఫైల్)



తుల్యభాగ డ్రెయిన్‌లో నీట మునిగిన చోట కనిపిస్తున్న బల్లకట్టు ఇనుప బద్దె

కరప: తుల్యభాగ డ్రెయిన్‌పై కొంగోడు వద్ద బల్లకట్టు నీట మునగడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు, పంట ఉత్పత్తులు తెచ్చుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంగోడు గ్రామరైతులకు చెందిన పొలాలు ఆ గ్రామానికి చేరువన, తుల్యభాగ డ్రెయిన్ ఆవల వేములవాడ సరిహద్దులలో ఉంటాయి. గతంలో తుల్యభాగ ఏటిని దాటేందుకు బల్లకట్టు ఉండేది. కొంగోడు రైతులు తమపొలాలకు వెళ్లేందుకు బల్లకట్టుపై ప్రయాణించి, తుల్యభాగ డ్రెయిన్ దాటుకుని రాకపోకలు సాగించేవారు. వర్షాకాలంలో అధికవర్షాలకు, పై మండలాల నుంచి వచ్చే వరద నీటితో తుల్యభాగ డ్రెయిన్ పొంగి ప్రవహించేది. అలాంటి సమయంలో రైతులు సాహసం చేసి బల్లకట్టుపై ప్రయాణించేవారు. కొంగోడు గ్రామస్తులు వేములవాడ మీదుగా మండల కేంద్రం కరప, ఇతర గ్రామాలకు వెళ్లాలంటే దగ్గర దారిగా డ్రెయిన్ దాటి వెళ్లేవారు. అలాగే వేములవాడ పరిసర గ్రామాల వారు కూడా గొల్లపాలెం, కోటిపల్లి, ద్రాక్షారామ వెళ్లాలంటే అడ్డదారిగా ఉంటుందని బల్లకట్టుపై వెళ్లి కొంగోడు మీదుగా రాకపోకలు సాగించేవారు. కరప, కాజులూరు మండలాలను అనుసంధానం చేసేందుకు తుల్యభాగ డ్రెయిన్‌పై కొంగోడు వద్ద బల్లకట్టు ప్రయాణ బాధలు తప్పించి, వంతెన నిర్మించాలని ప్రజలు కోరేవారు. కొంగోడులోని బల్లకట్టు ధ్వంసమైతే 2013లో అప్పటి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కొత్తది తయారు చేయించారు. వంతెన నిర్మాణానికి టీడీపీ, కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చినా నెరవేరలేదు. ఎన్నికల వస్తుండటంతో 2017లో టీడీపీ నాయకులు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరుచేయగా, పనులు ప్రారంభించి, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. బల్లకట్టు తిరిగే ప్రాంతంలో వంతెన నిర్మించడంతో బల్లకట్టును కొంచెదూరంలో ఏర్పాటుచేశారు. కొంతకాలం క్రితం ఆ బల్లకట్టు కూడా తుల్యభాగ డ్రెయిన్‌లో మునిగిపోయి నీటిలోనే ఉండిపోయింది. ఇప్పుడది లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు రైతులు యాతన పడుతున్నారు. అటువంతెన నిర్మాణం కాక, ఇటు బల్లకట్టు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వేములవాడ సరిహద్దున ఉండే పొలాలకు వెళ్లాలంటే బల్లకట్టులేక రానుపోను 8 కిలోమీటర్లు చట్టుతిరిగి రావాల్సి వస్తోందని ఆ గ్రామరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులకు కూలీలకు ఆటో చార్జీలు అదనంగా చెల్లించాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. రైతులు, ప్రజల ఇబ్బందులను గమనించి కొత్త బల్లకట్టు తయారు చేయించాలని కొంగోడు గ్రామస్తులు కోరుకుంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



కొంగోడు పొలాలు తుల్యభాగ ఏటికి అవతల ఉన్నాయి. పొలాలకు వెళ్లి రావాలన్నా, అటు వేములవాడ, కరప పరిసర గ్రామాలకు వెళ్లాలన్నా బల్లకట్టు మీద ప్రయాణించే వాళ్లం, ఇదే దగ్గరదారిగా ఉండేది. బల్లకట్ట నీట మునిగినా ఎవరూ పట్టించుకోవడంలేదు. వ్యవసాయ పనులకు కూలీలకు ఆటో చార్జీలు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త బల్లకట్టును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– మేడిశెట్టి నారాయణరావు, రైతు, కొంగోడు

చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది



తుల్యభాగ డ్రెయిన్ దాటివెళ్లేందుకు కొంగోడు వద్ద బల్లకట్టు ఉండేది. బల్లకట్టు పాడైపోయి, నీటిలో మునిగిపోయింది. దీంతో ఏటికి అవతల ఉండే పొలాలకు వెళ్లాలంటే ఏటిలో ఈత కొట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. ఈతరాని వారు కొంగోడు గ్రామంలోంచి గొర్రిపూడి మీదుగా ఎనిమిది కిలోమీటర్లు చుట్టుతిరిగి రావాల్సి వస్తోంది. రైతుల, ప్రజల ఇబ్బందులను గమనించి బల్లకట్టును బాగుచేయించాలి.

– వుడా చిన్నయాకోబు, కౌలురైతు, కొంగోడు

నేడు భావనారాయణుని శ్రీచక్ర స్నానం

సర్పవరంలో వైభవంగా కల్యాణోత్సవాలు



ఆలయ ప్రాంగణంలో భక్తి గీతాలు ఆలపిస్తున్న ఈశ్వరి బృందం

కాకినాడ రూరల్: సర్పవరంలో కొలువైన రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం సూర్యారావుపేట గ్రామంలో సాగర తీరాన సముద్రపు జలాలతో శ్రీచక్ర స్నానం నిర్వహించనున్నారు. స్వామి, అమ్మవార్లను సర్పవరంలోని ఆలయం నుంచి ఉదయం శేష వాహనంపై ఊరేగింపుగా తీసుకువెళ్లి వేలాది భక్తుల నడుమ అర్చకులు శ్రీచక్ర స్నానం నిర్వహించనున్నారు. కల్యాణోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో ఈశ్వరి బృందం భక్తి గీతాలతో అలరించారు. సాయంత్రం పుష్ప వాహనంపై స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: విద్యుత్ వార్షిక మరమ్మతుల దృష్ట్యా పవర్‌హౌస్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈ జి.ప్రసాద్ ఒక ప్రకటలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని రామారావుపేట, మెయిన్‌రోడ్డు, బాలాజీచెరువు, సాలిపేట, పీఆర్ కాలేజ్ రోడ్డు, నూకాలమ్మ ఆలయ ప్రాంతం, దంటువారివీధి, మునసబుగారి వీధి, టౌన్ రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యానికి సహకరించాలని కోరారు.

కేసుల్లో ఇరుక్కుంటే భవిత అంధకారం

- ఓట్ల లెక్కింపు రోజున అందరూ సంయమనం పాటించాలి
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఎస్పీ సతీష్‌కుమార్



నియోజకవర్గ రాజకీయ నాయకుల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్



కాకినాడ రూరల్: ఎన్నికల కేసుల్లో ఇరుక్కుంటే పిల్లల భవిష్యత్తు అంధకారమవుతుందని, అందువల్ల వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కోరారు. సర్పవరం జంక్షన్‌లో స్పందన ఫంక్షన్ హాల్ వద్ద కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని రాజకీయ నాయకులు, ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్, సెక్షన్ 144, 30 పోలీసు చట్టం జిల్లాలో జూన్ 6 వరకు అమలులో ఉంటుందన్నారు. మే 13న పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలని కోరారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదన్నారు. సెక్షన్ 144, పోలీసు సెక్షన్ 30లను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా కౌంటింగ్ రోజున, తరువాత రోజుల్లో అల్లర్లు, గొడవలకు యువత దూరంగా ఉండాలన్నారు. రోడ్లపైకి వచ్చి గొడవల్లో పాల్గొంటే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని లేకుంటే బంగారు భవిష్యత్తు పాడవుతుందని తల్లిదండ్రులకు హెచ్చరికలు జారీ చేశారు. జిల్లాలో ఓట్ల లెక్కింపు సజావుగా సాగేందుకు ఇప్పటికి 94 మంది బైండోవర్ కేసులు నమోదు చేశామని వెల్లడించారు. సమావేశంలో డీఎస్పీ హనుమంతరావు, సర్పవరం సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు, రూరల్ సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు సహకరించండి

- రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆర్వో కిశోర్



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో కిశోర్

కాకినాడ రూరల్: కాకినాడ జేఎన్‌టీయూకే క్యాంపస్‌లో జూన్ 4న జరగనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా సాగేందుకు నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ ఇట్ల కిశోర్ కోరారు. సర్పవరం జంక్షన్ వద్ద ఆర్వో కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. 13న పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా సహకరించారని, అదే విధంగా కౌంటింగ్‌కు సహకరించాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు తరఫున కౌంటింగ్ ఏజెంట్ల వివరాలు వెంటనే సమర్పించాలని కోరారు. ఏ విధమైన నేర చరిత్ర లేని వ్యక్తులను కౌంటింగ్ ఏజెంట్లుగా ప్రతిపాదించాలని సూచించారు. కౌంటింగ్‌కు 14 టేబుళ్ల ఏర్పాటు చేస్తున్నామని, పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి అదనంగా మరొక నాలుగు టేబుళ్ల ఏర్పాటు చేస్తామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా జూన్ 4న ఉదయం 6 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌లు తెరుస్తామని, తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు ప్రక్రియ చేపడతామన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం అదనంగా మరో 4 టేబుళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ విజయ ప్రసాద్, రామ కోటేశ్వరరావు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహితంగా కాకినాడ

- కమిషనర్ వెంకటరావు
- అధికారులతో పర్యావరణ కార్యాచరణ ప్రణాళిక సమావేశం



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: పర్యావరణ పరిరక్షణ ద్వారా కాకినాడ నగరాన్ని కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దేందుకు వివిధ సంస్థలు, శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్‌మెంటల్ ఇన్నోవేషన్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో పర్యావరణ కార్యాచరణ ప్రణాళికపై సమావేశం ఏర్పాటైంది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాహనాల వల్ల వచ్చే కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు, అధిక విద్యుత్ వినియోగం వల్లే కలిగే అనర్థాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా సోలార్ వినియోగంపై అవగాహన పెంచడం, వేడి వాతావరణాన్ని తగ్గించేందుకు పచ్చదనాన్ని అభివృద్ధి చేయడం వంటి అంశాలపై కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. అలాగే నీటి వనరులను పరిరక్షించేందుకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తరహాలో అనేక అంశాలను ప్రామాణికంగా తీసుకుని ప్రణాళికను రూపొందిస్తామన్నారు. ఈ ప్రక్రియలో కాలుష్య నియంత్రణ మండలి, వాతావరణ శాఖ, హైడ్రాలజీ విభాగానికి చెందిన సైంటిస్టులు, అటవీశాఖ, నగర పాలక సంస్థ అధికారులను కూడా భాగస్వామ్యం చేయనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్‌మెంటల్ ఇన్నోవేషన్ సౌత్ ఏషియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మణికుమార్, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, అదనపు డీఎఫ్‌వో శ్రీనివాస్, వాతావరణ శాఖ ప్రతినిధి రమేష్‌బాబు, సైంటిస్ట్ వి.రమణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సందీప్‌రెడ్డి, కార్యక్రమ నోడల్ అధికారి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యానికి కృషి చేయాలి



సర్పవరం జంక్షన్‌లో జీవ వైవిధ్య అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది శ్రీనివాసరావు

కాకినాడ రూరల్: భూమిపై ఉన్న ప్రతి జీవి మానవుడికి ఏదో ఒక రూపంలో ఉపయోగపడుతున్నందున వాటిని కాపాడుతూ జీవ వైవిధ్యానికి అందరూ కృషి చేయాలని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవనం సందర్భంగా సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరిట సహజ వనరులు మట్టి, నీరు, గాలి, జంతు, వృక్షాలను అస్థిర పద్ధతిలో వినియోగించడం వలన జీవ వైవిధ్యం దెబ్బతిని వరదలు వస్తున్నాయన్నారు. హిమపాతాలు కరిగిపోతున్నాయన్నారు. జీవ వైవిధ్యం ద్వారానే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాది యనమదల రామం, అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ సెంటర్ పరిశీలన



ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన జేసీ రామసుందర్‌రెడ్డి, ఆర్వో వెంకటరావు

కాకినాడ: జేఎన్టీయూకే ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావుతో కలిసి కౌంటింగ్ సెంటర్‌లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. కౌంటింగ్ సందర్భంగా విధి నిర్వహణలో ఉండే సిబ్బందికి, కౌంటింగ్ నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అక్కడి అధికారులు, సిబ్బందికి సూచనలిచ్చారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని ఆర్వో చెప్పారు. పటిష్టమైన భద్రత ఏర్పాట్లతో పాటు నిరంతర పర్యవేక్షణకు ఇద్దరు గెజిటెడ్ అధికారులను కూడా నియమించామన్నారు. స్ట్రాంగ్ రూమ్ ప్రాంగణమంతా సీసీ కెమెరా నిఘా కూడా ఏర్పాటు చేశామన్నారు. వీరి వెంట ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు, ఇతర ఉద్యోగులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కరప: నడకుదురు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలవ్వగా కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల కథనం మేరకు మండలం నడకుదురు గ్రామానికి చెందిన డేగల లక్ష్మణరావు మంగళవారం రాత్రి పంచాయతీ కార్యాలయం వద్ద రోడ్డు దాటుతుండగా కరప నుంచి కాకినాడ వైపు వెళ్తున్న మోటార్‌సైకిలిస్ట్ అతివేగంగా నడుపుతూ బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లక్ష్మణరావుకు కుడికాలు మోకాలు కిందిభాగంలో ఎముక విరగగా, తలకు ఎడమభాగంలో రక్తపు గాయమైంది. క్షతగాత్రుడి భార్య, కుమారుడు ఘటనా స్థలానికి వచ్చి 108లో అతనిని చికిత్స కోసం కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బుధవారం బాధితుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరసాకు ఘన నివాళి



పరసా సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కాకినాడ సిటీ: రాష్ట్ర సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు కామ్రేడ్ పరసా సత్యనారాయణ 9వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొగ్గుగని కార్మికుడిగా పని చేస్తూ సత్యనారాయణ కార్మికులపై సాగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా, ఆకలి లేని సమాజ స్థాపన కోసం తన జీవితాన్ని అర్పించారని కొనియాడారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా పని చేసినా అత్యంత సాధారణ జీవితం గడిపారని, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి నూతన నాయకత్వాన్ని తయారు చేసి కార్మికోద్యమానికి మారుపేరుగా నిలిచారని బేబీరాణి అన్నారు. ఆశ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, రాణి, బి.చంద్రశేఖర్, టి.వరప్రసాద్, ఎస్.సతీష్‌కుమార్, బి.రామకృష్ణ, ఎం.రామకృష్ణ, వి.సతీష్‌కుమార్, వీవీఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ వ్యర్థాల తొలగింపు

తాళ్లరేవు: రహదారి చెంతన పడేసిన మెడికల్ వ్యర్థాల తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, జాతీయ రహదారి 216 తాళ్లరేవు బైపాస్ రోడ్డు చెంతన కొందరు మెడికల్ వ్యర్థాలను పడేసి, వాటిని దగ్ధం చేస్తున్నారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మెడికల్ వ్యర్థాలు, నీడిల్స్ ప్రమాదకరంగా మారుతున్నాయంటూ తాళ్లరేవు మాజీ ఎంపీటీసీ సభ్యుడు బొంతు మోహన్, మరికొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. దీనిపై తాళ్లరేవు పంచాయతీ, గాడిమొగ పీహెచ్‌సీ సిబ్బంది స్పందించి, వాటిని అక్కడి నుంచి తొలగించారు. ఇటువంటి ప్రమాదకర వ్యర్థాలను రహదారి చెంతన వేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.